నమస్తే తెలంగాణ
సిద్దిపేట
13 | హైదరాబాద్, శనివారం 27 జనవరి 2024 | SIDDIPET

మెదక్ జిల్లా నంబర్‌వన్

- కలెక్టర్ రాజర్షి షా

మెదక్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): జిల్లా అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా నిలుస్తున్నదని మెదక్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం మెదక్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పర్యావరణానికి ప్రాధాన్యం ఇస్తూ ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ రహిత రిపబ్లిక్ డే వేడుకల్లో కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా జిల్లాలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని వివరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఉత్తమ సేవలు అందించిన పలువురు ఉద్యోగులకు కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ బాలస్వామి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి లక్ష్మీశారద, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీవోలు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో జెండా ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ బాలస్వామి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలత తదితరులు

మెదక్‌లో జాతీయ జెండాలతో విద్యార్థునుల ప్రదర్శన

సిద్దిపేటలో డిగ్రీ కాలేజీ మైదానంలో జాతీయ జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ తదితరులు

సిద్దిపేట జిల్లాను అగ్రగామిగా నిలపాలి

- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట, జనవరి 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ పిలుపునిచ్చారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన వేడుకలకు ఆయన హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, ప్రసంగించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి, జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషిచేయాలన్నారు. అనంతరం స్వాతంత్ర సమరయోధులను సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ స్కూల్ ఎంసాన్‌పల్లి, ప్రభుత్వ బాలికల హైస్కూల్ సిద్దిపేట, రాఘవపూర్ కేజీబీవీ విద్యార్థులు దేశభక్తి గేయాలపై చేసిన డాన్సులు అలరించాయి. కార్యక్రమంలో సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సీపీ డాక్టర్ అనురాధ, జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రివర్ణ శోభితం

- ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా 75వ గణతంత్ర వేడుకలు
- సంబురాలతో కళ కళ లాడిన కలెక్టరేట్లు
- జాతీయ జెండాలను ఆవిష్కరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించిన చిన్నారులు
- వాడవాడలా మార్మోగిన దేశభక్తి గీతాలు

75వ గణతంత్ర వేడుకలు సంబురంగా సాగాయి. శుక్రవారం ఊరూరా..వాడవాడలా త్రివర్ణపతాకం రెపరెపలాడింది. ఉమ్మడి మెదక్ జిల్లా కలెక్టరేట్లు సంబురాలతో కళ కళ లాడాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో జాతీయ జెండాలు ఆవిష్కరించి వందనం చేశారు. పటుచోట్ల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. జాతీయ జెండాలు చేతబూని పాఠశాలల విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. ఊరూవాడా దేశభక్తిగీతాలు, నినాదాలతో మార్మోగాయి. స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచిపెట్టారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, జనవరి 26

సిద్దిపేటలో స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్

సంగారెడ్డిలో విద్యార్థుల ప్రదర్శన..

సంగారెడ్డి సమగ్రాభివృద్ధికి కృషి

- కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి, జనవరి 26 (నమస్తే తెలంగాణ): జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం గణతంత్ర వేడుకల్లో భాగంగా పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను కలెక్టర్ ఎగురవేశారు. ఎస్పీ రూపేశ్‌తో కలిసి పోలీసులు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నదన్నారు. ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి 3,91,565 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీచైర్‌పర్సన్ మంజుశ్రీ, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీసీఎంఎస్‌చైర్మన్ శివకుమార్, పాల్గొన్నారు.

సంగారెడ్డిలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి తదితరులు

ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ కాలయాపన

- నియోజకవర్గానికి మంజూరైన దాదాపు రూ. 250కోట్లు నిలుపుదలపై ఆగ్రహం
- ఎంపీ, స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌నే గెలిపించుకోవాలి
- నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, జనవరి 26: కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించకుండా కాలయాపన చేయడానికే ప్రజాపాలన పేరుతో దరఖాస్తులు స్వీకరించిందని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపేటలో సర్పంచ్ సాన్వి రమాకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డిల ఆధ్వర్యంలో రూ. 75లక్షలతో వివిధ అభివృద్ధి పనులను మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలు వంద రోజుల్లో అమలు చేయడం అసాధ్యమని, ఆలోపే ఎంపీ ఎన్నికల కోడ్ వస్తుందని, ఇలా కాలం వెళ్లదీసే ప్రయత్నం చేస్తున్నదన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం మాజీ సీఎం కేసీఆర్ హయాంలో మంజూరు చేసిన దాదాపు రూ.250 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని మండిపడ్డారు. నియోజకవర్గ అభివృద్ధికి అడ్డుపడితే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. 2 ఎకరాల కంటే ఎక్కువ వ్యవసాయభూమి ఉన్న రైతులకు పెట్టుబడి సాయం రాలేదని, వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలందరూ బీఆర్ఎస్ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, జడ్పీ కోఆప్షన్ మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, యాదాగౌడ్, పవన్‌గుప్తా, చింతస్వామి, పిల్లుట్ల నర్సింహారెడ్డి, మర్రి మహేందర్‌రెడ్డి, మోకాళ్ల నవీన్ తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ఫ్యాక్టరీ పనులు త్వరగా పూర్తిచేయాలి

నంగునూరు మండలం నర్మెట ఆయిల్ ఫ్యాక్టరీ వద్ద వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

- ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి
- నెల నెలా ఆదాయం వచ్చే పంట పామాయిల్
- పంటకు కనీస మద్దతు ధర ప్రకటించాలి
- జూన్ నుంచి పంట కొనుగోలు ప్రారంభం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులు, తోటల పరిశీలన

సిద్దిపేట, జనవరి 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులను త్వరగా పూర్తి చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అధికారులకు సూచించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులు, తోటలను శుక్రవారం ఆయన ఆయిల్‌ఫెడ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలోనే అన్ని వసతులతో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని నంగునూరు మండలం నర్మెటలో (రూ.300 కోట్లు) నిర్మాణం జరుగుతోందన్నారు. ఈ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలో నూనె ఉత్పత్తి చేయడమే కాదు రిఫైనరీని పెట్టి ఫైనల్ ప్రొడక్ట్‌ను ఇక్కడి నుంచే నేరుగా మార్కెట్‌లోకి పంపిస్తామన్నారు. వాడిన నీటిని వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా రీసైకిల్ చేసే పద్ధతిని కూడా మొదలుపెట్టినట్లు తెలిపారు.ఫ్యాక్టరీ పూర్తి కావడానికి సంవత్సరం పడుతుందని, జూన్ నుంచి రైతుల పంటను కొనుగోలు చేస్తారని, ఇందు కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. రైతుల వద్ద పంట కొనుగోలు చేసిన తర్వాత ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ అధికారులే ఆశ్వరావుపేటకు తీసుకువెళ్లి అక్కడ ప్రాసెస్ చేస్తారన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, రెండు రోజుల్లోగా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమఅవుతాయన్నారు. సంవత్సరంలోగా ఫ్యాక్టరీ పనులు పూర్తి చేసుకొని ఇక్కడనే రిఫైనరీ ద్వారా నూనె ఉత్పత్తిని చేసుకుంటామని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

ఆయిల్ పామ్‌కు కేంద్రం మద్దతు ధర ప్రకటించాలి..

ఆయిల్ పామ్ మెట్రిక్ టన్నుకు రూ.15 వేల కనీస మద్దతు ధర ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయిల్‌పామ్‌పై కేంద్ర ప్రభుత్వం ఇంపోర్టు డ్యూటీని తగ్గించడంతో విదేశాల నుంచి మన దేశానికి పెద్ద మొత్తంలో నూనె దిగుమతి అవుతోందన్నారు. దీని ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని కోల్పోతున్నామని చెప్పారు.ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే ఆయిల్‌పై సెస్ విధిస్తే మన రైతుల ఆయిల్‌పామ్‌కు ధర పెరిగి లాభం చేకూరుతుందన్నారు. కేంద్రం వెంటనే సెస్ విధించాలన్నారు. కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ జీఎం సుధాకర్‌రెడ్డి, జడ్పీటీసీ తడిసిన ఉమావెంకట్‌రెడ్డి, నాయకులు జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోంరెడ్డి, రమేశ్‌గౌడ్, రాగుల సారయ్య, కృష్ణారెడ్డి, పురేందర్, నాగిరెడ్డి, అజ్జి, ఏఈవో గీత, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న మంత్రి

- ఈ నెల 30వ తేదీలోగా కొత్త గ్రామ పంచాయతీ భవనాలు ప్రారంభించాలి
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

హుస్నాబాద్, జనవరి 26: రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నాడని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హుస్నాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయిన పొన్నం హైదరాబాద్ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా నియమించబడ్డాడన్నారు. ఆయన హుస్నాబాద్ నియోజకవర్గంతో పాటు హైదరాబాద్ జిల్లాలో పెత్తనాన్ని చెలాయించాలి తప్పా ఇతర జిల్లాల్లో కూడా ఆయన లేకుండా అభివృద్ధి పనులు చేయొద్దని ఆదేశాలు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కరీంనగర్, సిద్దిపేట, హనుమకొండ జిల్లాల్లో తాను లేకుండా అభివృద్ధి పనులు ప్రారంభించొద్దని, శంకుస్థాపనలు చేయొద్దని అధికారులు, ప్రజాప్రతినిధులను ఆదేశించడం ఆయన నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. మంత్రి తీరు వల్ల ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు విలువలేకుండా పోతోందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉన్న హుజూరాబాద్ నియోజకవర్గంలలో మంత్రి అజమాయిషీ ఎక్కువైందని విమర్శించారు. ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధుల హక్కులను హరించేలా వ్యవహరించడం మంత్రికి తగదన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో కొత్త గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం పూర్తయిందని, వీటిని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఈ నెల 30వ తేదీలోపు జీపీ భవనాలు ప్రారంభించాలని, లేకుంటే సర్పంచ్‌లే ప్రారంభించుకుంటారన్నారు. సమావేశంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, ఎంపీపీలు లకావత్ మానస, మాలోతు లక్ష్మీ, జడ్పీటీసీ భూక్యా మంగ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, నాయకులు సుద్దాల చంద్రయ్య, తిరుపతిరెడ్డి, ఆకుల వెంకట్, అశోక్‌బాబు, బండి పుష్ప, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

స్కూల్‌లో స్పెషల్.. ఇంట్లో డిజిటల్ స్టడీ

సిద్దిపేట గర్ల్స్ హైస్కూల్‌లో డిజిటల్ కంటెంట్ బుక్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేట గర్ల్స్ హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థినులకు డిజిటల్ కంటెంట్ బుక్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే

సిద్దిపేట, జనవరి 26 : పాఠశాలల్లో స్పెషల్ స్టడీతో పాటు ఇంట్లో డిజిటల్ స్టడీ ఉండాలనే ఉద్దేశంతో 'డిజిటల్ కంటెంట్ బుక్స్ పంపిణీ చేస్తున్నామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట గర్ల్స్ హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థినులకు శుక్రవారం ఆయన డిజిటల్ కంటెంట్ బుక్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ సిద్దిపేట గర్ల్స్ హైస్కూల్‌ను కార్పొరేట్‌లాగా తయారు చేసుకున్నామని గుర్తుచేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో మేధస్సుకు పదును పెట్టే విధంగా ఈ బుక్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సిద్దిపేట అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుస్తుందని, అదే స్ఫూర్తితో విద్యారంగంలో ముందుండాలన్నారు. నేటి యువతరం డిజిటల్ , మొబైల్ వైపు విస్తరిస్తోందన్నారు. గత సంవత్సరం టెన్త్ ఫలితాలను రెట్టింపు చేసేలా ఇదొక చిరు ప్రయత్నం చేస్తున్నామన్నారు. గత సంవత్సరం నుంచి డిజిటల్ కంటెంట్ రూపంలో జిల్లాలోని టెన్త్ విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేస్తున్నామన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థులకు (2516 మంది) బుక్స్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. రాష్ట్రంలోనే సిద్దిపేట నియోజకవర్గం 100% ఫలితాలు సాధించి అగ్రస్థానంలో ఉండాలనేదే నా తాపత్రయం, అందుకు అందరం కలిసికట్టుగా కృషిచేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో ముచ్చటించిన ఎమ్మెల్యే

టెన్త్ చదువుతున్న విద్యార్థినులతో ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడారు. ''పొద్దున్నే అమ్మ నిద్ర లేపి చదివిస్తుందా....నేను పంపిన ఉత్తరం మీ అమ్మా నాన్నలకు అందిందా.. టీవీలు బంద్‌చేస్తున్నారా.. ఫోన్లు చూస్తున్నారా.. కేర్ టీచర్ చదివిస్తున్నారా''..అని అడిగారు. 'మీరంతా నా పిల్లలుగా ఇంత ప్రయత్నం చేస్తున్నా.. మీ భవిష్యత్ కోసం.. తల్లిదండ్రుల ఆశయాలు, మీరు చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆశిస్తున్నా'..అని ఎమ్మెల్యే అన్నారు.

వంద రోజుల్లో ఆరు కాదు.. 13 హామీలు అమలు చేయాలి

మర్కూక్, జనవరి 26 : 'ఆరు గ్యారెంటీలు కాదు.. 13 గ్యారెంటీలను అమలు చేయాలి. గెలిచిన వాళ్లకు ఓపిక ఉండాలి. ప్రతి పక్షాలకు అవకాశం ఇవ్వాలి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అలాంటి అవకాశాలు ఇవ్వడం లేదు'..అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయక్షేత్రంలో బీఆర్ఎస్ పార్లమెంట్ సమావేశం నిర్వహించగా తన్నీరు హరీశ్‌రావు ఫాంహౌస్ బయట విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌ను ఇష్టానుసారంగా మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ రాష్ట్రం సాకారం అయ్యేది కాదన్నారు. కేసీఆర్‌పై కాంగ్రెస్ మంత్రులు వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.